క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం: దేవగుప్తం రోడ్డు విస్తరణ నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు మార్చడానికి దేవగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పంట కాలువలో వలకట్లు



ఉప్పలగుప్తం పంట కాలువలో అక్రమంగా ఏర్పాటుచేసిన వలకట్లు

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో బినాపురం సెక్షన్ నుంచి పేరాయిచెరువు వెళ్లే పంట కాలువలో ఎక్కడికక్కడ అక్రమంగా వలకట్లు ఏర్పాటుచేశారు. కాలువ పొడవునా ఇష్టానుసారంగా వలకట్లను ఏర్పరచటంతో ఆ ప్రాంతంలో చెత్తాచెదారం, జంతువుల కళేబరాల వ్యర్థాలు నిలిచిపోవటంతో దుర్వాసన వెదజల్లి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల ఖరీఫ్ సీజన్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు చేలకు నీటి అవసరం లేకపోయే సరికి కాలువలపై ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

ఘనంగా చండీ హోమం



సూరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

ముమ్మిడివరం: స్థానిక ఉమా సూరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం దేవీ నవరాత్రుల్లో భాగంగా పౌర్ణమి తిథి సందర్భంగా నవ చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆకొండి రామకృష్ణ, మంత్రి ప్రగడ కృష్ణ, నూకల శంకరం, మామిడిపల్లి సూరిబాబు, వెల్లంకి శ్రీనివాస శర్మ, ఆలయ అర్చకులు హోమ క్రతువును నిర్వహించారు. అలాగే ఎయిమ్స్ కాలేజీ అవరణలో దేశంశెట్టి గోపినాథ్ బెనర్జీ స్వగృహంలో చండీ హోమం నిర్వహించారు.

జనరిక్ మందుల అమ్మకాల్లో లోపాలను సరిదిద్దాలి

అమలాపురం టౌన్: జనరిక్ మందుల అమ్మకాల్లో లోపాలను సరిదిద్దాలని బీజేపీ మెడికల్ విభాగం జిల్లా కన్వీనర్ కాళ్లకూరి గోపీకృష్ణ సంబంధిత శాఖకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన ఔషధి కేంద్రాల ద్వారా జనరిక్ మందుల అమ్మకాల్లో లోపాలు నెలకొన్నాయంటూ గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జనరిక్ మందులు, బ్రాండెడ్ కంపెనీల మందులకు ఒకే ఎమ్మార్పీ, బ్రాండ్ నేమ్ ఇవ్వడం ద్వారా ఏది జనరిక్కో, ఏది బ్రాండెడో తెలియక ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఉదాహరణకు నొప్పులకు సంబంధించిన మందు బ్రాండెడ్ కంపెనీలో పది టాబ్లెట్స్ రూ.65 ఉండగా, జనరిక్‌లో అదే మందు పది టాబ్లెట్స్ రూ.8కి లభిస్తుందన్నారు. కానీ రెండింటి మందులపై ఎమ్మార్పీ ధరలు రూ.65 ఉంటుందన్నారు. తక్షణమే ఈ లోపంపై ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జీజీహెచ్ ఫార్మసీ విభాగంలో తనిఖీలు

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలోని ఫార్మసీ విభాగాన్ని జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్‌తో కలిసి ఆర్‌ఏఓ మునిస్వామి బుధవారం తనిఖీ చేసి అక్కడి మందులను పరిశీలించారు. కొద్దిరోజుల క్రితం ఒక బాలుడికి గడువు ముగిసిన సిరప్‌ను ఇచ్చిన ఘటన నేపథ్యంలో ఆర్‌ఏఓ మునిస్వామి ఈ తనిఖీలు చేపట్టారు. అనంతరం అవుట్ పేషెంట్ విభాగాన్ని సైతం పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష



స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన దాతను సత్కరిస్తున్న గురుస్వాములు

తాళ్లరేవు: సుంకరపాలెంలోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామివారి ఆలయం వద్ద దీక్షను స్వీకరించిన స్వాములకు దాతల సహకారంతో 54 రోజుల పాటు భిక్షను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. దీంట్లో భాగంగా గురువారం తాళ్లరేవు గ్రామానికి చెందిన వియాన్ష్ అనే దాత సహకారంతో 350 మంది దాతలకు భిక్ష ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని వియాన్ష్ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, స్వాములు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్టం వారికి చుట్టమైంది

- యానాంలో నివాసాల చెంతనే బాణసంచా దుకాణాలు
- భయాందోళనలు వ్యక్తం చేస్తున్న స్థానికులు
- ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్‌కు విరుద్ధంగా షాపులు నిర్వహిస్తున్నా కన్నెత్తి చూడని అధికారులు



యానాం మెయిన్‌రోడ్డులో ఉన్న బాణసంచా సామగ్రి షాపు



పెట్రోల్ బంకుకు పక్కనే ఏర్పాటుచేసిన బాణసంచా షాపు

యానాం: పుదుచ్చేరి పేలుడు పదార్థాల యాక్టు, ఎక్స్‌ప్లోజివ్ రూల్స్–2008 ప్రకారం బాణసంచా, మందుగుండు సామగ్రి అమ్మే షాపులేవీ నివాసాల మధ్య ఉండకూడదు. కాని ప్రస్తుతం యానాం పట్టణం నడిబొడ్డున నివాసాల చెంత మాత్రమే కాకుండా ఆఖరికి పెట్రోల్‌బంకుల సమీపంలో సైతం బాణసంచా దుకాణాలు పెట్టేసి అమ్మకాలు సాగిస్తున్నారు. అంతేకాదు ఆయా దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు ఎక్విప్‌మెంట్, అగ్నిప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు సైతం కనిపించడం లేదు. దీంతో ఏ క్షణంలో ఎక్కడ ఎలాంటి పేలుడు సంభవిస్తుందోనని యానాం వాసులంతా ఆందోళన చెందుతున్నారు.

యానాం నియోజకవవర్గ పరిధిలో దీపావళి వ్యాపారం కోసం మందుగుండు సామగ్రి అమ్మేందుకు 6 హోల్‌సేల్ షాపులకు, మరో 30 తాత్కాలిక లైసెన్స్ షాపులకు అనుమతినిచ్చారు. ఆయా వ్యాపారులంతా శివకాశి తదితర ప్రాంతాల నుంచి సుమారు రూ.60 కోట్ల విలువ చేసే బాణసంచాను లారీల్లో తీసుకొచ్చి పట్టణంలో నివాసాల చెంత నిల్వ ఉంచారు. దీనికి తోడు హోల్‌సేల్ షాపులు సైతం గత నెల రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. యానాం చిన్నా సెంటర్ సమీపంలో కొన్ని దుకాణాలు, మరికొన్ని పెట్రోల్ బంకులకు చేర్చి, ఇంకొన్ని అపార్ట్‌మెంట్లు, నివాస ప్రాంతాల్లో సైతం నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్లయితే రేకుల షెడ్డుల్లో సైతం దుకాణాలు పెట్టేసి అమ్మకాలు చేసేస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున బాణసంచా పట్టణం మధ్యలోనే ఉంది. ఆయా దుకాణాల్లో లేదా మందుగుండు సామగ్రి నిల్వ చేసిన ప్రాంతాల్లో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే చుట్టుపక్కల నివాసితులు బలయ్యే ప్రమాదం ఉంది. ఊరికి దూరంగా ఉండాల్సిన మందుగుండు సామగ్రి దుకాణాలు పట్టణం మధ్యలో పెట్టడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బాణసంచా వ్యాపారులు తమ స్వలాభమే తప్ప ప్రజల భద్రతను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు తిలోదకాలు

పుదుచ్చేరి ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్–1884, పుదుచ్చేరి పేలుడు పదార్థాల యాక్టు, ఎక్స్‌ప్లోజివ్ రూల్స్–2008 ప్రకారం ఏ దీపావళి మందుల విక్రయ షాపులోనూ 100 కేజీలకు మించి స్టాకు ఉంచకూడదు. దుకాణాల వద్ద ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఉంచాలని, అధికంగా నివాసాలు ఉండే ప్రాంతాల్లో బాణాసంచా షాపులు ఉండకూడదని చట్టంలో స్పష్టంగా ఉంది. అయితే కొందరు వ్యాపారులు నిబంధనలకు తిలోదకాలిచ్చి కిరాణా, వస్త్ర తదితర వ్యాపారాలు చేస్తున్న షాపులను సైతం ఖాళీ చేసి వేలాది కేజీల బాణసంచా సామగ్రిని నిల్వ ఉంచారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 216 జాతీయ రహదారిలో ఓ షాపులో వేలాది కేజీల బాణసంచా సామగ్రిని నిల్వ ఉంచినట్లుగా సమాచారం. ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్‌కు విరుద్ధంగా షాపులు నిర్వహిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యానాంలో బాణసంచా దుకాణాదారులకు చట్టం చుట్టమైందన్న మాట సర్వత్రా వినిపిస్తుంది. దీపావళి షాపులకు పూర్తి పరిశీలన తర్వాతే అనుమతి ఇవ్వాల్సి ఉన్నా పుదుచ్చేరి నుంచి వచ్చిన అసిస్టెంట్ డివిజినల్ ఫైర్ ఆఫీసర్ తూతూ మంత్రంగా పని కానిచ్చేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక అధికారులను ప్రశ్నిస్తే దీపావళి షాపుల అనుమతిలో తమ ప్రమేయం లేదని, పుదుచ్చేరి నుంచి అసిస్టెంట్ డివిజినల్ ఫైర్ ఆఫీసర్ వచ్చి పరిశీలించి అనుమతులు మంజూరు చేశారని చెబుతున్నారు.

నిబంధనలు పాటించడం లేదు



ప్రభుత్వం రూపొందించిన ఎక్స్‌ప్లోజివ్స్ నిబంధనలను పాటించడం లేదు. స్థానిక అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుంది. కోట్లాది రూపాయల పేలుడు పదార్థాలు నివాసాల చెంత ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై ఎల్జీకి ఫిర్యాదు చేస్తాం.

– సుంకర కార్తీక్, సోషల్ యాక్టివిస్ట్, యానాం

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం



ముత్యాలమ్మ అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర ఆశ్వయుజ పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ దంపతులచే క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు విళ్ల సత్యన్నారాయణ, విళ్ల వీర తదితరులు పాల్గొన్నారు.

రాయల్ క్లబ్ పిటిషన్ కొట్టివేత

యానాం: యానాంలో రిక్రియేషన్ క్లబ్ పేరిట గాంబ్లింగ్ కార్యకలాపాల నిర్వహణకు అనుమతి కోరుతూ యానాం రాయల్ రిక్రియేషన్ క్లబ్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను గురువారం న్యాయమూర్తులు కొట్టి వేశారు. ఇంతకాలం నిర్వహించిన రాయల్ రిక్రియేషన్ క్లబ్‌కు యానాం మున్సిపాలిటీ ట్రేడ్ లైసెన్స్ రద్దు, లీజు అగ్రిమెంట్‌ను సంబంధిత క్లబ్ స్వాధీనం చేయడం వంటి కారణాల వల్ల పిటిషన్‌ను కొట్టి వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. అదేవిధంగా రాయల్ రిక్రియేషన్ క్లబ్‌కు సంబంధించి మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. యానాంలో రాయల్ క్లబ్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షుడు సత్తిబాబు

అమలాపురం టౌన్: మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.సత్తిబాబు అన్నారు. మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ యూనియన్ కమిటీ(ఏఐటీయూసీ అనుబంధ) సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ మున్సిపల్ ట్రాక్టర్ల కండిషన్‌ను మెరుగు పరచాలని, డ్రైవర్లకు వారంతపు సెలవు కచ్చితంగా అమలుచేయాలని కోరారు. ప్రతి ట్రాక్టర్‌లో విధిగా టూల్ కిట్‌ను ఉంచాలని, తరచూ సర్వీసింగ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపాలిటీ ట్రాక్టర్ల డ్రైవర్ల యూనియన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ములపర్తి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా మెండు చిన్న, కోశాధికారిగా పితాని శివకుమార్, సలహాదారులుగా కుంపట్ల బాల, జి.ఆదినారాయణ, దంగేటి శ్రీనులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల మృతి చెందిన యూనియన్ నాయకుడు అయితాబత్తుల జనార్థనరావు కుటుంబం నుంచి ఒకరికి ఉపాధి కల్పించాలని మున్సిపాలిటీకి విజ్ఞప్తి చేశారు.

డివిజన్ కేంద్రాల్లో శిక్షణ నిర్వహించాలి

అమలాపురం టౌన్: ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఉపాధ్యాయుల సొంత మండలాలు లేదా డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పల్లంరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమలాపురంలో వారు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగైదు జిల్లాలు కలిపి రెసిడెన్షియల్ ప్రోగ్రామ్ కాకుండా రెండు లేదా మూడు మండలాలు కలిపి లేదా నియోజకవర్గాల కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లో శిక్షణ ఏర్పాటు చేస్తే ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు జిల్లా ఎస్టీయూ తరపున జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు.

బాధితుడికి రూ.25 వేల సాయం



బాలుడు హేమంత్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: దీపావళి బాంబు చేతిలో పేలి గాయపడిన అయినవిల్లి మండలం విలస గ్రామానికి చెందిన బొక్కా హేమంత్ అనే బాలుడికి శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రూ.25 వేల సాయాన్ని సమకూర్చింది. ఈ ప్రమాదంలో హేమంత్ చేతి వేళ్లు ఛిద్రమై శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. విలస గ్రామానికి చెందిన పెద్దలు శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాసరావు దృష్టికి బాలుడి కుటుంబ పరిస్థితిని తెలియజేశారు. దీంతో సంఘం సభ్యులు ఓ వాట్సాప్ గ్రూప్ తయారుచేసి విరాళాల ద్వారా రూ.25 వేలు సేకరించారు. ముమ్మిడివరం శెట్టిబలిజ సంఘ ప్రతినిధుల ద్వారా హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రతినిధులు బాధితుడు హేమంత కుటుంబానికి విలస గ్రామంలో గురువారం ఆ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, గొవ్వాల రాజేష్, సంసాని బులినాని, దొమ్మేటి రాము, రెడ్డి శ్రీమన్నారాయణ, వాసంశెట్టి ఫణి, కడలి నాగు, కట్టా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

కాట్రేనికోన: మండల పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు గురువారం శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని 11 పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.2.82 కోట్లతో 48 పనులకు శ్రీకారం చుట్టారు. కందికుప్పలో సహకార ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు సహకార ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, విత్తనాల వెంకటరమణ, వెంట్రు సుధీర్ తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోండి



పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ఐ.పోలవరం: పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటు నమోదు చేయించుకోవాలని శాసనమండలి సభ్యుడు ఐ.వెంకటేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం మండలంలో మరమళ్ల జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఆయన స్థానిక ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు హక్కు నమోదుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఓటు నమోదు దరఖాస్తును, గోపీ మూర్తి బయోడేటాను ఆయన ఆవిష్కరించారు.

డంపింగ్ యార్డ్ తొలగించాలని నిరసన



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ సునీత తదితరులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామంలో కౌశిక డ్రైనేజీ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ తొలగించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద మహిళలు, గ్రామస్తులు గురువారం నిరసన తెలిపారు. డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో గ్రామస్తులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నిసార్లు పంచాయతీ చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దైవప పూర్ణిమ, చింతామణి, కొండా మల్లి, బిళ్ల లక్ష్మి, కొండా సూర్యకుమారి, బండారు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలంటూ నిరసన



ముంపు సమస్య పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న పేరూరు లంకతోట వాసులు

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు గ్రామ పరిధి లంకతోట అంబేడ్కర్ విగ్రహం వద్ద సరైన రోడ్డు, డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో ముంపు సమస్యతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షానికే లంకతోట రోడ్డు చెరువును తలపిస్తుందని, రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోయి రోగాలబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ముంపు సమస్యను పరిష్కరించాలని కోరారు.

28న పురోహిత స్మార్త విద్వత్ మహాసభ

ఐ.పోలవరం: ఈ నెల 28వ తేదీన భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్‌లో పురోహిత స్మార్త విద్వత్ మహాసభ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి నాగాభట్ల రవిశర్మ బుధవారం తెలిపారు. పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం గుర్తించాలనే లక్ష్యంతో సమాఖ్య పనిచేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల కుటుంబాలు పౌరోహిత్యాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్నాయన్నారు. సమాఖ్య వెబ్‌సైట్ ద్వారా పురోహితుల వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకూ 20 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. అన్ని ప్రాంతాల్లో విద్వత్ మహాసభలు ఏర్పాటు చేసి సమాఖ్య ద్వారా పురోహిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న భీమవరంలో పరీక్షలు నిర్వహించి పట్టా ప్రదానం చేస్తామన్నారు. ఈ నెల 20 లోపు పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి



శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

యానాం: విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని బుధవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఆయన విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తుల్లో శ్రీకృష్ణదేవరాయులు అగ్రగణ్యులని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న చండీ హోమం

ఐ.పోలవరం: ఆశ్వయుజ పౌర్ణమి మహాపర్వదినంను పురస్కరించుకుని గురువారం మురమళ్ల వీరేశ్వర స్వామివారి ఆలయంలో అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో చండీ హోమం ఘనంగా నిర్వహించారు. తొలుత గణపతి పూజ, మండపారాధన, అనంతరం చండీ హోమం, పూర్ణాహుతి జరిపారు. ప్రతి నెలా పౌర్ణమి తిథికి భక్తుల గోత్రనామాలతో అత్యంత శాస్త్రోక్తంగా దేవస్థానం తరపున చండీ హోమం నిర్వహిస్తారు. 94 మంది భక్తులు చండీ హోమంలో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆకొండి కిరణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆర్‌ఏఓకు వినతిపత్రం

యానాం: సావిత్రినగర్–గిరియాంపేట రహదారిలో రాత్రి వేళల్లో గేదెలను వదిలేస్తుండటంతో పలువురు తీవ్రగాయాల బారిన పడుతున్నారని, సమస్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్‌ఏఓ మునిస్వామికి మల్లాడి దాసు ఆధ్వర్యంలో సావిత్రి నగర్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రినగర్–గిరియాంపేట తీర గ్రామాల్లో తరచూ రాత్రి వేళల్లో గేదెలు అడ్డు వస్తుండటంతో వాహనచోదకులు, పాదచారులు గాయాల పాలవుతున్నారన్నారు. ఇటీవలే నలుగురు వ్యక్తులు ఘటనా స్థలిలోనే మృతిచెందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో ఇద్దరు తీవ్రగాయాలతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో మల్లాడి వర్మ, నాతి భైరవస్వామి, మల్లాడి దుర్గాప్రసాద్, ఎం.దయానంద్, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

పీడబ్ల్యూడీ ఎన్ఎంఆర్ సిబ్బంది ధర్నా



పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంఆర్ సిబ్బంది

యానాం: యానాం ప్రజాపనుల శాఖ(పీడబ్ల్యూడీ)లో గత 14 ఏళ్లుగా పనిచేస్తున్న ఓచర్ పెయిడ్ సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం స్థానిక పీడబ్ల్యూడీ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో ఓచర్ ఉద్యోగులుగా ఉన్న 1321 మంది నెలకు రూ.10 వేల జీతానికి పని చేస్తున్నామన్నారు. అయితే తమ వేతనాలను రూ.18 వేలు చేస్తున్నట్లు సీఎం రంగసామి గత ఆర్థిక బడ్జెట్‌లో ప్రకటించినా ఇప్పటివరకూ అమలు చేయలేదన్నారు. ఓచర్ ఉద్యోగులను వయసు ఆధారంగా సీనియారిటీ విభజించాలని, అలాగే రోజువారీ వేతనాన్ని రూ.825కు పెంచాలని కోరారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ప్రాతిపదికన తమను ఎంటీఎస్‌లుగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కత్రి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అయినవిల్లి: ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ ప్రభుత్వ కళాశాలలో రసాయన శాస్త్రం బోధించడానికి అర్హులైన అతిథి అధ్యాపక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డి. శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు నందు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. వీరికి గంటకు రూ.150లు చొప్పున గరిష్టంగా రూ.10 వేలు గౌరవ వేతనంగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్లను ఈ నెల 19లోపు అందజేయాలన్నారు. ఎంపిక ప్రక్రియ అభ్యర్థుల బోధనా పటిమ ఆధారంగా జరుగుతుందన్నారు.

సినిమాలు

వెంకటరమణ	స్వాగ్
శ్రీలలిత	జనక అయితే గనక
శేఖర్–1	విశ్వం
శేఖర్–2	ఇద్దరు
రమా	దేవర
వీపీసీ–1	వేట్టయాన్
వీపీసీ–2	లవ్ రెడ్డి

